

రామేశ్వర్‌పల్లిలో దెబ్బతిన్న పంటలపై సర్వే

భిక్కనూరు, మార్చి21: మండలంలోని రామేశ్వర్‌పల్లి గ్రామంలో ఇటీవల వడగండ్ల వర్షానికి దెబ్బతిన్న పంటలను ఏవో రాధ పరిశీలించి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ మండలంలోని ప్రతీ గ్రామాన్ని సందర్శించి దెబ్బతిన్న పంటలను సర్వే చేస్తున్నట్లు తెలిపారు. సర్వే చేసిన నివేదికలను ఉన్నతాధికారులకు నివేదించడం జరుగుతుందని వెల్లడించారు. పంట జరిగిన అన్ని పంలపైనా సర్వే చేస్తున్నట్లు ఏవో రాధ తెలిపారు. సర్వేలో ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

» ఈ నెలాఖరులోపు పరిష్కారం సాధ్యమేనా ? » ఓవైపు సిబ్బంది కొరత.. మరోవైపు ఎన్నికల హడావుడి
» పని ఒత్తిడితో తలలు పట్టుకుంటున్న అధికారులు » జిల్లాలో 30వేలకు పైగా ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు





ఎల్‌ఆర్‌ఎస్‌పై అయోమయం!

కామారెడ్డి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి లేఅవుట్ అనుమతులూ లేకుండా కొనుగోలు చేసిన ఇళ్ల స్థలాలను క్రమబద్ధీకరణను ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో సిబ్బంది కొరతతోపాటు ఎన్నికల కోడ్ రావడంతో గడువులోగా పూర్తి అవుతుందో, కాదోనని అధికారుల్లో సందిగ్ధత నెలకొంది. ఈ ప్రక్రియలో నిపుణులైన టౌన్ ప్లానింగ్ సిబ్బంది, మున్సిపల్ బిల్డింగ్ ఇన్స్‌పెక్టర్లు, సర్వేయర్లు, చైన్‌మెన్‌లు ఎంతో కీలకం. అయితే జిల్లాలోని కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి మున్సిపాలిటీలతో పాటు ఆయా గ్రామ పంచాయతీలలో సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తోంది. దీంతో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన వేగవంతంపై పలు సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.

ఓవైపు ఎన్నికల పనులు.. మరోవైపు ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన

దేవాదాయ, వక్ఫ్‌బోర్డు, ప్రభుత్వ, కోర్టు పరిధిలో ఉన్న భూములను మినహాయించి ఈనెల 31 వరకు క్రమబద్ధికరణ ప్రక్రియ చేయాలని అధికారులకు ప్రభుత్వం ఆదేశించింది. వేలల్లో అందిన ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను లోతుగా పరిశీలించి క్షేత్రస్థాయిలో తనిఖీలు చేసి ప్రొసీడింగ్స్ ఇవ్వాలంటే ఐదారు నెలలు పడుతుందని మున్సిపల్ అధికారులు, సిబ్బంది చెబుతున్నారు. ఈ క్రమంలోనే పార్లమెంట్ ఎన్నికలు రావడంతో ఆ పనులను చేపడుతూనే ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియను ఈ నెలాఖరు లోపు ఎలా పూర్తిచేసేదని అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియ పూర్తిచేయడం అసాధ్యమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. గత ప్రభుత్వ హయాంలో రియల్‌ఎస్టేట్ వ్యాపారులు డీటీసీపీ అనుమతులు లేకుండానే వెంచర్లు చేసి ప్లాట్లను విక్రయించారు. అనుమతులు ఉన్నాయా లేవా అని తెలుసుకోకుండానే అనేకమంది ప్లాట్లను కొనుగోలు చేశారు. ఈ ప్లాట్లలో నిర్మాణాలు చేయలేని పరిస్థితి. దీనిని దృష్టిలో ఉంచుకుని గత ప్రభుత్వం 2020లో ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియకు శ్రీకారం చుట్టింది.

మార్గదర్శకాలు లేక..

గత ప్రభుత్వం ఆన్‌లైన్‌లో రూ.1000 ఫీజు చెల్లించి లేఅవుట్‌లేని ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసుకోవడంతో పాటు దరఖాస్తు చేసుకుంటే రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ప్లాట్ల క్రయవిక్రయాలు జరుపుకోవచ్చని ఆదేశించింది. దీంతో సెల్‌ఫోన్ యాప్, మున్సిపల్ శాఖ వెబ్‌సైట్ ద్వారా వేలాదిమంది ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకున్నారు. అడపదడప ఈ అంశమై ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాలతో దరఖాస్తుల పరిశీలన చేపట్టిన అధికారులు చర్యలు తీసుకున్న అందుకు సంబంధించిన మార్గదర్శకాలు సరిగా లేకపోవడంతో మున్సిపాలిటీల్లో ఇంతకాలం ముందుకు సాగలేదు. కాని ఈ దరఖాస్తుల రూపేనా ప్రభుత్వానికి కాస్త ఆదాయం సమకూరింది. లే అవుట్‌లకు పరిశీలించకపోవడంతో ఆయా మున్సిపాలిటీలకు, గ్రామ పంచాయతీలకు 33శాతం జరిమానా రూపేనా రావాల్సిన ఆదాయం రావడం లేదు. దీంతో స్థానిక సంస్థలకు ఎల్‌ఆర్‌ఎస్‌తో ఆదాయం సమకురడం లేదు. జిల్లాలో ఎల్‌ఆర్‌ఎస్‌పై వచ్చిన దరఖాస్తులను పరిశీలించేందుకు తగిన సిబ్బందిని కేటాయిస్తే ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులకు పరిష్కారం దొరకడంతోపాటు జీపలు, మున్సిపాలిటీలకు ఆదాయం సమకురుతుందని అధికారులు పేర్కొంటున్నారు.

జిల్లాలో 30వేలకుపైగా దరఖాస్తులు

2020లో ప్రారంభమైన ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియ వివిధ కారణాలతో నిలిచిపోయింది. ఇటివల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ దరఖాస్తులను పరిష్కరిస్తామని హామీ ఇచ్చింది. అయితే జిల్లాలో 526 గ్రామ పంచాయతీలు, కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి మున్సిపాలిటీలలో మొత్తం 30 వేలకు పైగా ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు వచ్చాయి. జిల్లాలోని గ్రామ పంచాయతీలలో 10వేలకు పైగా ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తులు రాగా కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి మున్సిపాలిటీలో 20వేల వరకు దరఖాస్తులు వచ్చాయి. ఈ దరఖాస్తులు పరిశీలించడానికి గతంలోనే సర్వేనంబర్లు, విస్తీర్ణం ప్రకారం క్లస్టర్లుగా విభజించారు. రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీ రాజ్, పట్టణ ప్రణాళికల విభాగాల అధికారులతో బృందాలను ఏర్పాటుచేశారు. దరఖాస్తుదారులంతా ఆన్‌లైన్‌లో రూ.1000 చెల్లించారు. ఇళ్లు కట్టుకోవాలన్నా, అమ్ముకోవాలన్నా ఇబ్బందులు పడుతున్న వారికి గత ప్రభుత్వం నిర్ణయంతో మేలు చేకురే అవకాశం ఉంది. ప్రస్తుత రాష్ట్రప్రభుత్వం సైతం ఇప్పటికే లేఅవుట్ లేని ప్లాట్లను క్రమబద్ధీకరించేందుకు గ్రీన్‌సిగ్నల్ సైతం ఇచ్చింది. జిల్లాలోని గ్రామపంచాయతీ, మూడు మున్సిపాలిటీల్లో ఉన్న ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను పరిష్కరిస్తే ప్రభుత్వానికి సుమారు రూ.60 కోట్లకు పైగా ఆదాయం సమకురే అవకాశం ఉంది.



• సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

ఓటింగ్ శాతం మరింత పెంచేలా

స్వీప్ కార్యక్రమాలు నిర్వహించాలి

• కలెక్టర్ జితేష్ వి.పాటిల్

కామారెడ్డిటౌన్, మార్చి21: ఏప్రిల్1 నాటికి 18ఏళ్లు నిండిన యువతను నూతన ఓటరుగా నమోదు చేయాలని, ఓటింగ్‌శాతం మరింత పెంచేలా స్వీప్ కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహించాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్వీప్‌కోర్ కమిటీ సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలో మరో 3శాతం మేర 18 నుంచి 19ఏళ్లలోపు యువతను ఓటరుగా నమోదుచే యడానికి అవకాశం ముందని, ఆ దిశగా యువతను ప్రోత్సహించి ఓటర్లుగా నమోదు చేసుకునేలా చూడాలన్నారు. మే 13న జరుగే లోక్‌సభ పోలింగ్‌కు 'నేను కచ్చితంగా ఓటేస్తాను' అనే భావన కలిగించి ఓటింగ్ శాతం పెంచేలా చూడాలన్నారు. 12 రకాల ఫొటో గుర్తింపుకార్డులో ఎదో ఒకటి తప్పనిసరిగా పోలింగ్ బూత్‌కు తీసుకువచ్చేలా అవగాహన కలిగించాలన్నారు. కార్యక్రమంలో స్థానిక సంస్థ ల అదనపుకలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, స్వీప్ నోడల్ అధికారి వెంకటేష్, సభ్యులు ధర్మానాయక్, శ్యైలి, రామగిరి శర్మ, ఆర్‌డీవోలు రంగనాథ్, తదితరులు పాల్గొన్నారు.

• ఎన్నికలు పారదర్శకంగా జరిగేలా చూడాలి

లోక్‌సభ ఎన్నికలు యజ్ఞంలా భావించి పారదర్శకంగా, ప్రశాంతంగా జరిగేలా అధికారులు కృషిచేయాలని కలెక్ట ర్ జితేష్‌వి.పాటిల్, ఎస్పీ సింధూశర్మలు కోరారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలలో వ్యయనియంత్రణ ప్రధాన అంశమని, ప్రతీ ఖర్చును లెక్కించాల్సి ఉంటుందని తెలిపారు. ఇందుకు నియమించిన ఫ్లయింగ్ స్క్వాడ్, వీడియో సర్వేలైన్స్, స్టాటిస్టికల్ సర్వే లెన్స్, వీడియో వీనింగ్ బృందాలు, సెక్టోరల్ అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని కోరారు. ఎస్పీ సింధూశర్మ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ వెలువడిన నాటినుంచి విస్తృత తనిఖీలు చేస్తూ మూడురోజుల్లో 7.6లక్షలు, గురువారం 4.50లక్షల నగదు తోపాటు 986 లీటర్ల ఐఎంఎఫ్‌ఎల్ మద్యాన్ని పట్టుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో డీఎప్‌వో నిఖిత, ఆర్‌టీవో శ్రీనివాస్‌రెడ్డి, ఆర్‌డీవోలు, రమేష్ రాథోడ్, రంగనాథ్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ వేళలు

శుక్రవారం	శనివారం
ఇఫ్తార్	సహర్
సా.6.33	ఉ.4.56



అల్లాహ్ నీ నొసటిన రాసిన రాతను సమ్మతించి తృప్తిపడు. అందరికెల్లా ఆత్మ సంతృప్తిని పొందిన వాడవుతావు

నిజామాబాద్ డీసీసీబీ హస్తగతం

• చైర్మన్‌పై నెగ్గిన అవిశ్వాస తీర్మానం • వైస్‌చైర్మన్‌కే ఇన్‌చార్జీ చైర్మన్ బాధ్యతలు • చక్రం తిప్పిన కాంగ్రెస్ నేతలు



రమేష్‌రెడ్డికి గజమాల వేస్తున్న నాయకులు

నిజామాబాద్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నిజామాబాద్ డీసీసీబీని కాంగ్రెస్ కైవసం చేసుకుంది. చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాసం నెగ్గింది. వైస్‌చైర్మన్‌కే ఇన్‌చార్జీ చైర్మన్‌గా బాధ్యతలను ఇచ్చారు. పూర్తిస్థాయి చైర్మన్ ఎన్నిక ఈనెల 26న ఉంటుందని సహకారశాఖ అధికారులు ప్రకటించారు. డీసీసీబీ చైర్మన్‌గా పనిచేసిన భాస్కర్‌రెడ్డి ఒకరోజు ముందే రాజీనామా చేసిన నిబంధనల ప్రకారం జిల్లా సహకార అధికారికి అందించకపోవడంతో సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి మొత్తం 17మంది సభ్యులు హాజరుకాగా 16మంది సభ్యులు అనుకూలంగా చేతులెత్తడంతో అవిశ్వాసం నెగ్గినట్లు అధికారులు ప్రకటించారు. డీసీసీబీ పీఠంపై నజర్‌పెట్టిన కాంగ్రెస్ పార్టీ నేతలు చక్రం తిప్పడంతో పదేళ్ల తర్వాత మళ్లీ వారిచేతుల్లోకి వచ్చింది.

జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డిపై పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. ఆయనపై ఈనెల 4న డీసీసీబీకి చెందిన 15 మంది సభ్యులు అవిశ్వాస తీర్మానంపై సహకార శాఖల అధికారులకు నోటీసులు ఇచ్చారు. ఆ నోటీసులను పరిశీలించిన అధికారులు 15రోజుల సమయం ఇచ్చారు. ఈనెల 21న సమావేశాన్ని నిర్వహిస్తున్నామని సభ్యులందరికీ నోటీసులు అందించారు. నిబంధనల మేరకు గురువారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి కోరంకు మించి మొత్తం 17 మంది సభ్యులు హాజరుకావడంతో ఓటింగ్‌ను సహకార శాఖ అధికారులు నిర్వహించారు. చైర్మన్‌కు వ్యతిరేకంగా 16మంది డైరెక్టర్లు చేతులు ఎత్తడంతో అవిశ్వాసం నెగ్గినట్లు జిల్లా సహకార శాఖ అధికారి ప్రకటించారు. నిబంధనల ప్రకారం అవిశ్వాస తీర్మానంకు కోరం ఉండటంతో పాటు మొత్తం సభ్యుల్లో 2/3వ వంతు హాజరుకావాలి. నియమ నిబంధనల ప్రకారం 14 మంది డైరెక్టర్లు ఉంటే సరిపోతుంది. అంతకుమించి హాజరుకావడం చైర్మన్‌కు వ్యతిరేకంగా పెట్టిన అవిశ్వాసాన్ని 16 మంది డైరెక్టర్లు సమర్థించడంతో అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. సమావేశంలో చర్చించిన అనంతరం నిబంధనల ప్రకారం చైర్మన్‌పై అవిశ్వాసం నెగ్గిందని అధికారికంగా ప్రకటించారు. బ్యాంకుకు సంబంధించిన లావాదేవీలు జరిగేందుకు ప్రస్తుత వైస్‌చైర్మన్ రమేష్‌రెడ్డికే ఇన్‌చార్జి చైర్మన్‌గా నియమిస్తున్నట్లు ప్రకటించారు. బ్యాంకు పూర్తిస్థాయి చైర్మన్ ఎన్నికను ఈనెల 26న నిర్వహిస్తున్నట్లు జిల్లా సహకారశాఖ అధికారి శ్రీనివాస్ ప్రకటించారు. నిబంధనల మేరకే ఈ సమావేశాన్ని నిర్వహించినట్లు తెలిపారు.



విజయకేతనం చూపుతున్న డైరెక్టర్లు

• ఒకరోజు ముందే పోచారం భాస్కర్‌రెడ్డి రాజీనామా

డీసీసీబీ చైర్మన్, డైరెక్టర్ పదవులకు పోచారం భాస్కర్‌రెడ్డి ఒక రోజు ముందే బుధవారం రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను రాష్ట్ర సహకార శాఖ కమీషనర్‌కు పంపించారు. నిబంధనల ప్రకారం చైర్మన్ జిల్లా సహకార శాఖ అధికారికి నేరుగా వచ్చి అందించాలి. ఒకవేళ ఆయనకు ఇవ్వలేని పరిస్థితి ఉంటే జిల్లా కలెక్టర్‌కు ఇవ్వాలి. వీటికి భిన్నంగా నేరుగా రాష్ట్ర సహకార శాఖ కమీషనర్‌కు పంపించడం వల్ల దాన్ని అధికారులు నిబంధనల ప్రకారం తీసుకోలేదు. నోటీసులకు అనుగుణంగానే జిల్లాకేంద్ర సహకార బ్యాంకులో డైరెక్టర్లతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో చర్చించిన మీదట నిబంధనల ప్రకారం ఓటింగ్ నిర్వహించారు. రెండు పదవులకు రాజీనామా చేసిన భాస్కర్‌రెడ్డి మాత్రం ఈ సమావేశానికి హాజరుకాలేదు. ఆయనతోపాటు పోతంగల్, బోర్లాంకు చెందిన డైరెక్టర్లు కూడా హాజరుకాలేదు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో మొత్తం 20 మంది డైరెక్టర్లు ఉండగా గురువారం 17 మంది హాజరయ్యారు. బుస్సాపూర్‌కు చెందిన నాగంపేట శేఖర్ రెడ్డి మాత్రం సమావేశానికి హాజరైన ఓటింగ్‌లో పాల్గొనలేదని జిల్లా సహకార అధికారి తెలిపారు.

• వైస్‌చైర్మన్‌కే ఇన్‌చార్జి చైర్మన్‌గా బాధ్యతలు

డీసీసీబీ బ్యాంక్ చైర్మన్‌పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో వైస్ చైర్మన్ రమేష్‌రెడ్డికే ఇన్‌చార్జి చైర్మన్‌గా బాధ్యతలను అప్పచెప్పారు. ఆయన ఆధ్వర్యంలో డైరెక్టర్లు కొన్ని రోజుల క్రితం కాంగ్రెస్‌లో చేరారు. వారిని క్యాంపుకు తరలించడంతో పాటు అవిశ్వాస తీర్మానం జరిగేంతవరకు క్యాంపులోనే ఉంచారు. సమావేశానికి అర్ధగంట ముందు ప్రత్యేక వాహనంలో డీసీసీబీ కార్యాలయానికి తీసుకువచ్చారు. సమావేశం జరిగి అవిశ్వాసం నెగ్గిన తర్వాతనే అందరూ బయటకువెళ్లారు. డీసీసీబీ డైరెక్టర్లుగా ఎన్నికైన సమయంలోనే రమేష్‌రెడ్డి చైర్మన్ కోసం ప్రయత్నాలు చేశారు. అప్పుడున్న పరిస్థితుల వల్ల ఆయనకు రాలేదు. చివరకు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత పరిస్థితులు మారడం ఆయనకు అనుకూలించింది. ఈనెల 26న జరిగే చైర్మన్ ఎన్నికలు కూడా ఆయనే పూర్తిస్థాయి చైర్మన్‌గా ఎన్నిక కానున్నారు.

• చక్రం తిప్పిన ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు

డీసీసీబీ కాంగ్రెస్ కైవసం చేసుకునేలా ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు చక్రం తిప్పారు. మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు డాక్టర్ భూపతిరెడ్డి, మదన్‌మోహన్ రావు, హన్మంతురావు, రాష్ట్ర ప్రభుత్వసలహాదారులు షబ్బీర్ అలీతో పాటు ఉమ్మడి జిల్లాకు చెందిన నేతలు సమన్వయంతో డైరెక్టర్లు కాంగ్రెస్‌లో చేరేలా చూశారు. బోధన్‌కు చెందిన పట్వారి గంగాధర్ పదేళ్ల క్రితం డీసీసీబీ చైర్మన్‌గా ఉన్నారు. ఆ సమయంలో వ్యవసాయ సహకార శాఖల మంత్రిగా ఉన్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఆయనను బీఆర్ఎస్‌లో చేర్చుకున్నారు. బ్యాంకు బీఆర్ఎస్ చేతుల్లోకి వచ్చేలా చూశారు. ప్రస్తుతం కాంగ్రెస్ నేతలు కూడా అదే పాలసీని అవలంభించారు. మాజీమంత్రి, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో డైరెక్టర్లు పార్టీలో చేరేలా చూడటంతోపాటు సీఎం రేవంత్‌రెడ్డి వరకు తీసుకువెళ్లారు. చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం నోటీసులు ఇచ్చినప్పటి నుంచి అవిశ్వాసం నెగ్గేంతవరకు అన్ని రకాల సహాయ సహకారాలను అందించారు. ఆయా నియోజకవర్గాల పరిధిలోని కాంగ్రెస్ ఇన్‌చార్జిలు కూడా డైరెక్టర్లు పార్టీలో చేరే విధంగా చూడటంతో అవిశ్వాస తీర్మానం నెగ్గింది. అవిశ్వాస తీర్మానం నెగ్గి రమేష్‌రెడ్డికి ఇన్‌చార్జి చైర్మన్‌గా బాధ్యతలను ఇవ్వగానే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంబరాలను నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నేత ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, అంతిరెడ్డి రాజిరెడ్డి, ఇతర నేతలు డీసీసీబీ కార్యాలయానికి వచ్చి ఇన్‌చార్జి చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

• పోలీసుల భారీ బందోబస్తు

డీసీసీబీ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం సమావేశం నిర్వహించడంతో పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. డీసీసీబీ డైరెక్టర్లు రాకముందే ఇద్దరు సీఐల ఆధ్వర్యంలో ఈ బందోబస్తును నిర్వహించారు. బ్యాంకు సిబ్బందితోపాటు డైరెక్టర్లు, సహకార శాఖ అధికారులను మాత్రమే లోనికి పంపించారు. అవిశ్వాస తీర్మానం తర్వాతే ఇతరులను బ్యాంకులోకి అనుమతించారు.



భిక్కనూరులో పంటలను పరిశీలిస్తున్న మంత్రి జూపల్లి

ఎకరాకు రూ.10వేల నష్టపరిహారం

• మంత్రి జూపల్లి కృష్ణారావు • భిక్కనూరులో షబ్బీర్ అలీతో కలిసి పంటల పరిశీలన • రైతులను ఆదుకుంటామని హామీ



దోమకొండలో రైతులతో మాట్లాడుతున్న మంత్రి

భిక్కనూరు, మార్చి21: రైతులకు ఎంత ఇచ్చినా తక్కువేనని, వడగండ్ల వర్షానికి పంటనష్టపోయిన ప్రతీరైతుకు పంటనష్టం కింద ప్రస్తుతం ఎకరాకు రూ.10వేలను ప్రభుత్వం అందజేస్తుందని నిర్ణయం తీసుకున్నట్లు జిల్లా ఇన్‌చార్జి, ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. భిక్కనూరు మండలంలోని అంతంపల్లి, జంగంపల్లి గ్రామాల్లో ఇటీవల అకాల వడగండ్ల వర్షానికి దెబ్బతిన్న పంటలను ప్రభుత్వసలహాదారుడు షబ్బీర్‌అలీతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా అంతంపల్లి, జంగంపల్లి గ్రామశివారుల్లో పంటలు దెబ్బతిన్న రైతులను ఓదార్చారు. ఈమేరకు మంత్రి మాట్లాడుతూ ఎకరాకు రూ.10వేలు సరిపోదని అందరికీ తెలిసిందే కానీ గత బీఆర్ఎస్ పాలకులు ఆర్థికవ్యవస్థను చిన్నాభిన్నం చేసి, ఆర్థికంగా రాష్ట్రాన్ని దివాలా తీసేలా చేసిందని, రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం చేసిన అప్పులకు గానూ ప్రతినెలా రూ.60వేల కోట్ల వడ్డీ చెల్లించాల్సి వస్తోందని అన్నారు. ఈవడ్డీ చెల్లించడానికే మళ్లీ అప్పు చేయాల్సి వస్తోందని అన్నారు. ఎన్ని ఇబ్బందులున్నా రైతులను ఆదుకోవాలన్న ఉద్దేశ్యంతో సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు పంట నష్టపోయిన రైతులను ఆర్థికసాయం అందిస్తామన్నారు. రైతులు నిరాశ, నిస్పృహ లోనుకావద్దని, ఇది రైతుసంక్షేమ ప్రభుత్వమని రైతులను అన్నివిధాలుగా అండగా ఉంటామన్నారు. ప్రతీ గ్రామంలో వ్యవసాయాధికారులు సర్వే చేయ్యడం జరుగుతుందని, పంట నష్టపోయిన ప్రతిరైతును ఈ ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు పంటనష్టంపై సమీక్షిస్తున్నార న్నారు.

• బీఆర్ఎస్ హయాంలో ఒక్కరైతుకూ నష్టపరిహారం అందలే..

గతేడాది ఇదే సమయంలో కామారెడ్డి జిల్లాలో ప్రకృతివైపరిత్యానికి వేల ఎకరాల్లో పంట దెబ్బతిని రైతులు లబోదిబోమన్నారని, ఆ సమయంలో ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి పంటలను పరిశీలించి వారిని ప్రభుత్వం ఆదుకోవాలని పంట నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేసిన ఏ ఒక్క రైతుకు కూడా పంట నష్టపరిహారం కింద రూపాయి కూడా ఇవ్వలేదని ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ అన్నారు. వడగండ్ల వర్షానికి వేల ఎకరాల్లో పంటనష్టపోయిందని సమాచారం తెలియగానే సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు తాము దెబ్బతిన్న పంటలను పరిశీలించి రైతులను ఓదార్చి ఆదుకుంటామని హామీ ఇచ్చామన్నారు.

• మంత్రికి రైతుల వినతిపత్రం అందజేత

పంటనష్టం ఎకరాకు రూ.50వేలు అందజేయాలని కోరుతూ మంత్రి జూపల్లి కృష్ణారావుకు భిక్కనూరు మండల రైతులు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రైతులను ఆదుకోవాలని మంత్రికి విజ్ఞప్తి చేయగా వారిని ఓదార్చి రైతులను రాష్ట్రప్రభుత్వం అన్నివిధాలుగా ఆదుకుంటుందని భరోసా కల్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ సురేష్‌షెట్కార్, కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, పార్టీ మండల అధ్యక్షుడు భీంరెడ్డి, పీసీసీ కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి, ఎంపీపీ గాల్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

• రైతులు అధైర్యపడొద్దు.. ఆదుకుంటాం

దోమకొండ: వడగండ్లకు పంటలు నష్టపోయిన రైతులు అధైర్యపడొద్దని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గురువారం మండలంలోని లింగుపల్లి గ్రామంలో వడగండ్ల వర్షానికి నేలరాలిన వరి పంటను మంత్రి జూపల్లి ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీతో కలసి పరిశీలించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, జడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, మండలాధ్యక్షుడు అనంత్‌రెడ్డి,రామస్వామిగౌడ్, డీసీసీ జనరల్ సెక్రటరీ తాటిపల్లి శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

బీర్కూర్: మంత్రి జూపల్లి కృష్ణారావు, నియోజకవర్గ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్‌రెడ్డితో కలిసి బీర్కూర్ మండలంలో పర్యటించారు. అకాల వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. రైతులు అధైర్యపడొద్దని, ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఆయన వెంట నియోజకవర్గ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శి కాంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు యామ రాములు, సాహెబ్‌రావు, భరత్, రైతులు తదితరులు ఉన్నారు.

జిల్లా ఇన్‌చార్జి మంత్రి ప్రత్యేక పూజలు

ధర్పల్లి, మార్చి 21: నిజామాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారెడ్డి, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి గురువారం మండలంలోని మద్దుల్ తండా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే భూపతిరెడ్డి స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంట నష్టపోయిన రైతులందరికీ పరిహారం అందేవిధంగా ప్రభుత్వం చూస్తుందని ఆయన భరోసా కల్పించారు. మండలంలో రామడుగు, నడిమి తండా, కొటాల్‌పల్లి గ్రామాల్లో ఇటీవల కురిసిన వడగండ్ల వానతో దెబ్బతిన్న పంటలను మంత్రి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆర్మూర్ చిన్నబాల్ రాజ్, మాజీ సర్పంచ్ మిట్టపల్లి గంగారెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.



ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రి, ఎమ్మెల్యే

అంగన్‌వాడి కేంద్రాల్లో పోషణ పక్వాడ కార్యక్రమం

ఇందల్వాయి, మార్చి 21: గర్భిణులు, బాలింతలు చిన్న పిల్లల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీడీపీవో స్వర్ణలత అన్నారు. పోషన్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా గురువారం ఇందల్వాయి మండలంలోని లోలం గ్రామం లోగల రైతువేదికలో మండల స్థాయి పోషన్ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి మండల సూపర్‌వైజర్లు, వివిధ గ్రామాల అంగన్‌వాడి టీచర్లు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. సీడీపీవో స్వర్ణలత మాట్లాడుతూ గర్భిణులు, బాలింతల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహిస్తూ ఆరోగ్య లక్ష్మి కార్యక్రమానికి తప్పకుండా హాజరుకావాలని సూచించారు. ప్రభుత్వం గర్భిణులు, బాలింతల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని ఈ అవకాశాన్ని ప్రతీ ఒక్కరు ఉపయోగించుకోవాలన్నారు. గర్భిణులకు పోషన్‌పక్వాడ కార్యక్రమంలో సామూహిక సీమంతాలు నిర్వహించారు. చిన్నపిల్లలకు అన్నప్రాసన, అక్షరభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో స్వర్ణలతతో పాటు మండల ఆరోగ్య విస్తీర్ణ అధికారి శంకర్, అంగన్‌వాడి సూపర్‌వైజర్లు, టీచర్లు, ఆశాకార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

ముప్కాల్: అంగన్‌వాడిలో అందించే సేవలను గర్భిణీ, బాలింతలు వినియోగించుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి అన్నారు. గురువారం బాల్కొండ మండలంలోని చిట్టాపూర్ గ్రామంలోని ప్రీ స్కూల్ కార్యక్రమంలో భాగంగా పోషకాహారం కార్డులను అందజేశారు. తల్లిపాల ప్రాముఖ్యత, వ్యక్తి గత పరిశుభ్రత, పెరటి తోట పెంపకంపై అవగాహన కల్పించారు. అనంతరం పోషక ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో చిట్టాపూర్, బోదేపల్లి, వన్నెల్(బి)గ్రామాల్లోని అంగన్‌వాడిలు, ఆశలు, తదితరులు పాల్గొన్నారు.

ఎడపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అంగన్‌వాడి కేంద్రాల్లో పోషణ పక్వాడ కార్యక్రమాన్ని చేపట్టిందని ఐసీడీఎస్ సీడీపీఓ జానకమ్మ అన్నారు. గురువారం ఎడపల్లి మండల కేంద్రంలోని 4వ అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన పోషణ పక్వాడ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు, 0-6 ఏళ్ల మధ్య వయసు ఉన్న పిల్లలకు పౌష్టికాహార ప్రాముఖ్యతను వివరించారు. విద్య, ఆరోగ్యమే లక్ష్యంగా పోషణ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. తల్లితో పాటు శిశువు సంపూర్ణ ఆరోగ్యంగా జీవించేందుకు వెయ్యి దినాల ప్రణాళిక ప్రాముఖ్యత, విశిష్టతను వివరించారు.



పిప్రిలో పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ వెంకటరమణమ్మ

గర్భాధారణ నుంచి ప్రసవం వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి, పౌష్టికాహారం గురించి, తల్లి ఆరోగ్యంతో పాటు శిశువు ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాలి తగు జాగ్రత్తలను వివరించారు. ఆరోగ్యం, విద్యకు అంగన్ వాడీ కేంద్రాల్లో ప్రాముఖ్యత కల్పిస్తున్నామనీ, ప్రైమరీ దశలోనే శిశువులకు విద్యపై అవగాహన కల్పించడానికి అంగన్‌వాడీ టీచర్లు కృషి చేస్తున్నారన్నారు. అనంతరం గర్భిణులకు సామూహిక శ్రీమంతం, శిశువులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయరాణి, అంగన్‌వాడీ టీచర్లు సుజాత, విజయ లక్ష్మి, తులసి, నాగమణి, గర్భిణులు, బాలింతలు తదితరులు ఉన్నారు.

ఆర్మూర్‌రూరల్: ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందజేసే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకొని చిన్నారు లకు క్రమం తప్పకుండా ఇవ్వాలని అంగన్‌వాడి సూపర్‌వైజర్ వెంక ట రమణమ్మ అన్నారు. గురువారం ఆర్మూర్ మండలం పిప్రి గ్రామంలో పోషణ పక్షోత్సవ కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడి కేంద్రాలలో చిన్నపిల్లల తల్లులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలింతలు, గర్భిణులు తాజా ఆకు కూరలు, సిరి ధాన్యాలు తప్పకుండా తీసుకో వాలని, వీటి వల్ల పిల్లలు, గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. అంగన్ వాడి కేంద్రాలలో లభించే ఆహారాన్ని తీసుకోవడం వల్ల పిల్లలు శారీరకంగా ధృడంగా ఉంటారన్నారు. ఈ కార్యక్ర మంలో అంగన్ వాడి టీచర్‌లు, ఎఎన్ఎంలు, పంచాయతీ కార్యదర్శి మురళీకాంత్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.


చిట్టాపూర్‌లో పోషక విలువలపై వివరిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి

స్నేహసొసైటీలో ప్రపంచ డౌన్ జెనిటిక్ దినోత్సవం

నిజామాబాద్ అర్బన్, మార్చి 21: నగరంలోని మారుతినగర్‌లోగల స్నేహసొసైటీ ఫర్ రూరల్ రీకన్‌స్ట్రక్షన్ ఇందూరు అకాడమి ఆఫ్ పిడియాట్రిక్స్, ఐఎంఏ సంయుక్తంగా ప్రపంచ డౌన్ జెనిటిక్ దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షుడు దామోదర్, పిడియాట్రిక్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీశైలం, వైద్యులు శ్రీకాంత్, బాలేష్, తదితరులు పాల్గొన్నారు. పుట్టుకతో శరీరానికి కావాల్సిన హార్మోన్ సిండ్రోమ్‌లు తక్కువగా ఉండటం వల్ల శారీరక, మానసిక రుగ్మతులకు గురవుతారని వారన్నారు. సరైన వైద్యం అందించినట్లయితే వారు వారి పనులు చేసుకోవడంతో పాటు మంచి ఉన్నత స్థాయికి ఎదిగే ఆస్కారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో స్నేహసొసైటీ కార్యదర్శి సిద్ధయ్య, ప్రిన్సిపల్ జ్యోతి, వైస్ ప్రిన్సిపల్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు

అనుమతిలేకుండా బార్ నడిపిన వ్యక్తికి జైలుశిక్ష

● మద్యం తాగిన వారిపై కేసు నమోదు

నిజామాబాద్ రూరల్, మార్చి 21: జిల్లా కేంద్రంలోని గూపన్‌పల్లిలో మోటాడిరెడ్డి కల్యాణ మండపంలో అనుమతి లేకుండా మినీ బార్ నిర్వహించిన నరేందర్ గౌడ్‌కు (40) జైలుశిక్ష విధించి రిమాండ్‌కు తరలిచినట్లు రూరల్ ఎస్‌హెచ్‌వో మహేష్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గూపన్‌పల్లి గ్రామ నడిబొడ్డు న మోటాడిరెడ్డి ఫంక్షన్ హాల్‌ను బార్‌గా మలిచి టెబుల్స్ వేసి మందుబాబుల కోసం సిట్టింగ్ సిద్ధంచేశారు. ఖరీదైన మద్యంతోపాటు చికెన్ వండిపెడుతున్నారు. మద్యం మత్తులో కొందరు వీరంగంచేస్తూ, స్థానికులకు ఇబ్బందులకు గురిచేస్తున్నారు. కొందరు ఆకతాయిలు కూడా సేవిస్తూ నిత్యం మత్తులో జోగుతున్నారు. స్థానికులు, కాలనీవాసులు ఎంత చెప్పినా నిర్వాహకులు ఖాతరుచేయడం లేదు. దాంతో ట్రైనీ ఐపీఎస్ చైతన్యరెడ్డి గూపన్‌పల్లిలో ఈనెల 19న రాత్రి స్థానికులకు చట్టవ్యతిరేక పనులు, ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పించారు. ఎలాంటి సమస్యలున్నా పోలీసుల దృష్టికి తీసుకురావాలని తెలపడంతో స్థానిక మహిళలు అక్కడే ట్రైనీ ఐపీఎస్‌కు ఫిర్యాదుచేయడంతో పాటు దగ్గరుండి మినీ బార్‌కు తీసుకెళ్లారు. అక్కడ పరిస్థితిని చూసి ట్రైనీ ఐపీఎస్ ఆగ్రహం వ్యక్తంచేశా రు. ఎలాంటి అనుమతులు లేకపోవడం, ఎన్నికల కోడ్ ఉండటం వంటి వాటి దృష్ట్యా మినీ బార్ నిర్వాహకుడు నరేందర్‌గౌడ్‌ను రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రెండో తరగతి జుడిషల్ మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచడంతో ఆయనకు జైలు శిక్ష విధించారు. దాంతో రిమాం డ్ విధించి సారంగాపూర్‌లోని జిల్లా జైలుకు తరలించారు. మద్యం సేవిస్తున్న 20 మందిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

జీజీహెచ్‌లో వంకర పాదాలు వ్యాధిపై శిక్షణ కార్యక్రమం


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న వైద్యులు

పెద్దబజార్, మార్చి 21:ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో వంకర పాదాల వ్యాధిపై వైద్యులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆసు పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమరాజ్ తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభు త్వ ఆసుపత్రిలో ఎముకల విభాగం నందు అమెరికా నుంచి అనుభవజ్ఞులైన డాక్టర్ కార్లటన్ బ్రూస్ స్మిత్ నేతృత్వంలో పిల్లలలో పుట్టుకతో లోపంగా ఉండే వంకర పాదాలు వ్యాధి సమస్యలను చికిత్స విదానాలను తెలియజేశారు. ఈ సందర్భంగా కార్లటన్ బ్రూస్ స్మిత్ మాట్లాడుతూ చికిత్స విధానాలను ఎముకల విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్, సీనియర్ రెసిడెంట్స్, పీజీలు, నోస సభ్యులకు క్లుప్తంగా ఆచరణాత్మకంగా ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సదస్సులో ఎముకల వైద్యులు నాగేశ్వర్‌రావు, పీఎల్ శ్రీనివాస్, కిరణ్ కుమార్‌లతో పాటు సుమారు 50 మంది వైద్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిర, అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

టీయూలో వ్యాసరచన పోటీలు



వ్యాస రచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

డిచ్‌పల్లి, మార్చి 21: తెలంగాణ యూనివర్సిటీలో భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా పీడీఎస్‌యూ, పీవైఎల్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతి పురష్కరించు కొని వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి కర్క గణేశ్, పీవైఎల్ ప్రధాన కార్యదర్శి నవీన్ లు మాటాడుతూ.. దేశంలో జరుగుతున్న పరిణామాలపై విద్యార్థులు, యువత చైతన్యం కావలన్నారు. దేశంలో ప్రజాస్వామిక వాతవరణం కోరవడిందన్నారు. జీవన విధానంపై తినే తిండి, కట్టె బట్టపై ఆకాంక్షలు మొదలువుతున్న యన్నారు. నేడు జరిగే భగత్‌సింగ్, రాజ్‌గురువు, సుఖ్‌దేవ్ 93వ వర్ధంతి సభలను విజయవంతం చేయలన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ ప్రతినిధులు అనిల్, ఆమర్, అజయ, సందీప్, నిఖిల్, రాజు, పాల్గొన్నారు.

'అవినీతి నుంచి తప్పించుకోవడానికే పదవికి రాజీనామా'

నసురుల్లాబాద్, మార్చి 21:ఒక వైపు సహకార సంఘం లో ఆడిట్ జరుగుతుండగా, అధికారులకు సహకరించవలసిన సహకార సంఘం చైర్మన్ తన పదవికి రాజీనామా చేయడం ఎంత వరకు సమంజసం అంటూ, కామారెడ్డి జిల్లా నసురుల్లాబాద్ మండలం మైలారం సహకార సంఘం అధ్యక్షులు శ్రీనివాస్ రాజీనామా చేయడం పట్ల డైరెక్టర్లు ఆయన పనితీరుపై తీవ్రంగా మండిపడుతున్నారు. అధికారం అడ్డం పెట్టుకుని సహకార సంఘంలో అవినీతికి పాల్పడినట్లు డైరెక్టర్లు మహేందర్‌గౌడ్, ధర్మయ్య, యాదవ్ పలువురు డైరెక్టర్లు ఆరోపించారు. ముఖ్యంగా సహకార సంఘంలో జరిగిన అవినీతి అక్రమాలపై ఆడిట్ అధికారులు విచారణ కొనసాగిస్తుండగా, సహకార సంఘం అధ్యక్షులు పెరిక శ్రీనివాస్ అధ్యక్ష పదవికి రాజీనామా చేయడం పట్ల డైరెక్టర్లు మండిపడుతున్నారు. ఆరు లక్షల రూపాయల ఎరువుల విక్రయాల్లో అవినీతికి పాల్పడినట్లు డైరెక్టర్లు ఆరోపించారు. డీసీవో మైలారం సహకార సంఘంలో లోతుగా విచారణ జరిపితే చైర్మన్ అవినీతి అక్రమాలు వెలుగు చూస్తాయని డైరెక్టర్లు డిమాండ్ చేస్తున్నారు.

బీజేపీ అనుబంధ సంఘాల కార్యవర్గాల ఎన్నిక

ఎల్లారెడ్డి, మార్చి 21: ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో గురువారం అసెంబ్లీ కన్వీనర్ లింగారావు, ప్రధాన కార్యదర్శి రవీంద్రరావు ఆధ్వర్యంలో బీజేపీ అనుబంధ సంఘాల కార్యవర్గాలను ఎన్నుకున్నారు. యువ మోర్చా అధ్యక్షుడిగా మహేందర్, ఉపాధ్యక్షుడిగా ప్రవీణ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా గణేష్ నాయక్, కిసాన్ మోర్చా అధ్యక్షుడిగా సంగారెడ్డి, ఉపాధ్యక్షుడిగా కృష్ణ, ఎస్సీ మోర్చాల మండల అధ్యక్షుడిగా సాయిలు, ఎస్టీ మోర్చా మండల అధ్యక్షుడిగా భాస్కర్‌నాయక్, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులుగా సాయిలు, బీజేపీ మండల ఉపాధ్యక్షుడిగా వెంకట్‌రెడ్డి, అంజయ్య, రాములు, మండల అధి కార ప్రతినిధులు సాయి కిరణ్, మహేశ్వరం రవి, కార్యదర్శులుగా రాజు, చంద్రయ్య, సాయిలు, సంతోష్, పవన్, శ్రావణ్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నర్సింలు, ప్రధాన కార్యదర్శి నరేష్ పీకే, ఎస్ఎన్‌రెడ్డి, పరువయ్య తదితరులు పాల్గొన్నారు.



నూతన కార్యవర్గం దృశ్యం

భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలి

బీర్కూర్, మార్చి 21 : బీర్కూర్ మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో నూతనంగా నిర్మిస్తున్న భవన నిర్మాణ పనులను గురువారం ఎంపీపీ రఘు పరిశీలించారు. పనులు నత నడకన సాగుతుండటంపై ఎంపీపీ కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తంచేశారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి గతంలో 2.90 కోట్ల నిధులు మంజూరు చేయించారని అన్నారు. అయితే గత మూడేళ్ళ క్రితం భవన నిర్మాణ పనులను ప్రారంభించినా కాంట్రాక్టర్ నేటికీ పనులు పూర్తి చేయలేదని అన్నారు. కాంట్రాక్టర్ పనులను వేగవంతం చేసి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని, విద్యార్థులకు అందుబాటులో తీసుకురావాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీటీసీ సందీప్ తదితరులు ఉన్నారు.

వేగంగా కేంద్రీయ విద్యాలయ నిర్మాణ పనులు

● జూన్‌నాటికి అంతా సిద్ధం ● 20 కోట్లతో అన్ని వసతుల కల్పన


నిర్మాణంలో ఉన్న కేంద్రీయ విద్యాలయం

బోధన్ రూరల్, మార్చి 21: బోధన్ పట్టణంలోని పాండు ఫారంలో 8 ఎకరాల విశాల స్థలంలో కేంద్రీయ విద్యాలయం భవన నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. వచ్చే విద్యా సంవత్సరానికి విద్యార్థులకు అందుబాటులో ఉండే విధంగా అన్ని వసతుల కల్పనతో సర్వం సిద్ధం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ సీపీ డబ్ల్యూడీ నిధులు 20 కోట్ల రూపాయలతో ఇప్పటికే 70 శాతం పనులు పూర్తయ్యాయి. ప్రతి రోజు 150 మంది కూలీలతో, ఇంజనీర్లతో పనులు నాణ్యతతో వేగవంతంగా కొనసాగుతున్నాయి. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఎడ్యుకేషన్ (సిబిఎస్‌ఈ)కు మంచి ఆదరణ ఉంది. కేంద్రీయ విద్యాలయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలకు మొదటి ప్రాధాన్యత ఉంటుంది. పది సంవత్సనాల క్రితం బోదన్ పట్టణంలోని బెల్లాల్ ప్రాంతంలో గల మధుమాలంచ జూనియర్ కళాశాల ప్రాంగణంలో కేంద్రీయ విద్యాలయం ప్రారంభం అయింది, ఒకటవ తరగతి నుండి పదవ తరగతి వరకు పాఠశాలలో బోధన కొనసాగుతుంది. ప్రతీ క్లాసుకు 40 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. సంవత్సనం క్రితం విద్యార్థుల సౌకర్యార్థం పాండు ఫారంలో 20 కోట్ల రూపాయల నిధులతో నూతన భవన నిర్మాణ పనులు ప్రారంభం అయ్యాయి. నేటికి పనులు 70 శాతం పూర్తయ్యాయి. వచ్చే విద్యా సంవత్సరానికి మొదటి తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు చదువుతో పాటు క్రీడల్లో రాణించడానికి బాస్కెట్ బాల్, వాలీ బాల్, కోకో కోర్టులతో పాటు అన్ని హంగులతో భవన నిర్మాణం పూర్తి కానుంది.

70 శాతం నిర్మాణపు పనులు పూర్తి

ఇప్పటికే 70 శాతం కేంద్రీయ విద్యాలయం పనులు పూర్తయ్యాయి. వచ్చే విద్యాసంవత్సరానికి విద్యార్థులకు అందుబాటులో ఉండే విధంగా అన్ని హంగులతో కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు నాణ్యతతో పనులు చేపడుతున్నాం. ఇప్పటికే రెండు అంతస్తుల భవన నిర్మాణ పరులు పూర్తయ్యాయి.

- హేమంత్ రఘు వంశీ ఇంజనీర్

'ఎన్నికల్లో లబ్ధిపొందాలని చూస్తున్నారు'



సమావేశంలో మాట్లాడుతున్న రమ

పెద్దబజార్, మార్చి 21:మతం పేరుతో ప్రజల మధ్య వైశామ్యాలు పెంచి ఎన్నికల లబ్ధిపొందాలని చూస్తున్నారని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్‌వీ రమ అన్నారు. గురువారం నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ దేశంలో కార్మిక వర్గానికి నష్టం చేస్తూ కార్మిక వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్న బీజేపీని పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించేందుకు కార్మిక వర్గం సిద్ధం కావాలన్నారు. గడిచిన పది సంవత్సరాల కాలంలో దేశంలో బీజేపీ కార్మిక కర్షక ప్రజావ్యతిరేక విధానాలను అనుసరించిందని మండిపడ్డారు. దేశం అన్ని రంగాల్లో వెనుకబాటుకు గురవుతుందన్నారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం నరేంద్రమోదీ పట్ల వస్తున్న వ్యతిరేకతను కప్పిపుచ్చుకునేందుకు మతం పేరుతో ప్రజల మధ్య చిచ్చుపెడుతున్నారని అన్నారు. కార్మిక వ్యతిరేక చట్టాలు రాబోయే కాలంలో కార్మికులకు ఉరి తాడులుగా మారుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు కనీస వేతనం 26వేల రూపాయలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న అన్ని రంగాల కార్మికుల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్, ఉపాధ్యక్షులు రమేష్ బాబు, నారాయణ, మోహన్, రేణుక, సుకన్య, గణేష్, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

జక్రాన్‌పల్లి, మార్చి21: మండలంలోని మునిపల్లి గ్రామంలో గురువారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేశారు. గ్రామంలో సుమారు 1129పశువులు, ఆవులకు కలిపి గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్టు పశువైద్యాధికారిణి డాక్టర్ శిరీష తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలమిత్ర రాజ్‌కుమార్, పశు వైద్యసిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై ఎన్నో పోరాటాలు చేశాం

పెద్దబజార్, మార్చి 21:కార్మికుల సమస్యలపై ఎన్నో పోరాటాలు నిర్వహించామని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని మగ్దుం భవన్ సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనే ని సాంబశివరావు ఆధ్వర్యంలో నర్సింగ్‌రావు సీపీఐ నాయకులు చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఉద్యోగిగా ఉంటూ మున్సిపల్ కార్మికుల సమస్యలపై ఇతర కార్మికుల పక్షాన పోరాటాలు నిర్వహించి తనదైన గుర్తింపు పొందిన నాయకుడు ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింగ్‌రావు ఇటీవల కాలంలో వాలంటరీ రిటైర్డ్‌మెంట్ తీసుకున్నందున సీపీఐలో చేరారు. ఈ కార్యక్రమంలో జాతీయ నాయకుడు చాడ వెంకట్‌రెడ్డి, పశ్యపద్మ, బోస్, బాల్‌రాజ్, యేసురత్నం, తదితరులు పాల్గొన్నారు.

సోమిర్యాగడి తండాలో సేవాలాల్ మాలధారులకు భిక్ష

ఎల్లారెడ్డి, మార్చి 21: ఎల్లారెడ్డి మండలంలోని సోమిర్యాగడి తండాలో సేవాలాల్ మాలధారణ వేసిన స్వాములకు గురువారం సేవాలాల్ మహారాజ్ ఆలయంలో పంచాయితీ కార్యదర్శి వెంకట్రాములు భిక్ష ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సేవాగడ్ ఆలయ కమిటీ చైర్మన్ గోవింద్, గ్రామ మాజీ ఉప సర్పంచ్ డాన్సింగ్ తండా వాసులు నగేష్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

పెద్ద కొడప్‌గల్, మార్చి 19: మండలంలోని పోలింగ్ కేంద్రాలను గురువారం ఇన్‌చార్జి ఎంపీడీవో సూర్యకాంత్ పరిశీలించారు. ఈ సందర్భంగా సూర్యకాంత్ మాట్లాడుతూ.. రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతులు ఎలా ఉన్నాయనే అంశంపై పోలింగ్ కేంద్రాలు సందర్శిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల నాటికి వసతులు లేని పోలింగ్ కేంద్రాలలో అన్ని రకాల వసతులు కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన డీఎల్‌పీవో


బాల్కొండలో పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న డీపీవో తరుణ్‌కుమార్

ముప్కాల్, మార్చి21: బాల్కొండ మండల కేంద్రంలోని పలు పోలింగ్ కేంద్రాలను జిల్లా పంచాయతీ అధికారి తరుణ్‌కుమార్ గురువారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతులు కల్పనపై ఆరా తీశారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. మరుగుదొడ్లు, విద్యుత్, నీటిసౌకర్యం కల్పించాల న్నారు. వృద్ధులు, వికలాంగుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ లక్ష్యం మేరకు పన్నులు వసూలు చేయాలని పేర్కొ న్నారు. బాల్కొండలో వననర్సరీని పరిశీలించి మొక్కల వివరాలను అడిగితెలు సుకున్నారు. వానాకాలంనాటికి అన్ని మొక్కలు అందుబా టులో ఉండేలా సస్యరక్షణ చర్యలు చేపట్టాలని అన్నారు. ఆయన వెంట డీఎల్‌పీవో శివకృష్ణ, ఎంపీడీవో విజయ్‌భాస్కర్‌రెడ్డి, ఎంపీవో వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి రజనీకాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పన్నులు కట్టి గ్రామాభివృద్ధికి సహకరించాలి

మోస్రా,మార్చి21: ప్రజలు పన్నులు సకాలంలో చెల్లించి గ్రామాభివృద్ధికి సహకరించాలని ఎంపీవో రఫీ అన్నారు. మోస్రా గ్రామ పంచాయతీ పరిధిలో డీపీవో తరుణ్ కుమార్, డీఎల్‌పీవో సాయిబాబా ఆదేశాల మేరకు గురువారం మండల కేంద్రంలో పన్నుల వసూళ్లకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ పన్నులు వసూలు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ప్రేమ్ కుమార్, కృష్ణ, ముతీబ్, భూమేష్, మహేశ్వరి, గ్రామ పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ చంద్రశేఖర్, బిల్ కలెక్టర్ గంగాధర్, కారోబార్లు రాము, కాశీరాం, గ్రామ పెద్దలు బిల్లా రాజేశ్వర్ రెడ్డి, బొజ్జ శ్రీనివాస్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.


పన్నులు వసూలు చేస్తున్న దృశ్యం

డిగ్రీ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షల ఫీజు అపరాధ రుసుము గడువు పెంపు

డిచ్‌పల్లి, మార్చి 21: తెలంగాణ వర్సిటీ అనుబంధ కళాశాలల పరిధిలోని డిగ్రీ కోర్సులకు చెందిన 2,4,6వ సెమిస్టర్, రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలకు ఫీజు తేదీ అపరాధ రుసుముతో వచ్చే నెల 15 వరకు గడువు పొడిగించినట్లు పరీక్షల నియంత్రణాధికారి ప్రొ.అరుణ ప్రకటనలో తెలిపారు. ఫీజు చెల్లింపునకు ఏప్రిల్ 15వరకు గడువు ఉండగా రూ.100 అపరాధ రుసుముతో ఏప్రిల్ 16వరకు, రూ.500లతో 18వరకు, రూ.1000లతో 19 వరకు, 2వేల 20 తేదీ వరకు చెల్లించేందుకు ఆవకాశం ఉందని సీవోఈ తెలిపారు. పూర్తి వివరాలకు కళాశాలల ప్రిన్సిపాళ్లను సంప్రదించలన్నారు.

కులాస్‌పూర్‌లో బోనాల పండుగ

మోపాల్, మార్చి 21: మండలంలోని కులాస్‌పూర్ గ్రామంలో గురువారం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా బోనాల పండుగ నిర్వహించారు. బుధవారం గ్రామంలో పెద్దమ్మతల్లి విగ్రహాన్ని ప్రతిష్టించారు. గత కొన్ని సంవత్సరాల నుంచి గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోందని గ్రామ పెద్దలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులతో పాటు వీడీసీ గ్రామస్థులు, గ్రామ మహిళలు పాల్గొన్నారు.

ప్రత్యేక అధికారితీరుపై గ్రామ సభలో ఆగ్రహం

పెద్ద కొడప్‌గల్, మార్చి 21: మండలంలోని కాటేపల్లి గ్రామంలో గురువారం నిర్వహించిన గ్రామసభలో గ్రామ ప్రత్యేక అధికారి తీరుపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ ఆవరణలో గ్రామసభ ప్రారంభం కాగా ముందుగా వివిధ సమస్యలను గ్రామస్థులు అధికారులకు తెలిపారు. దీంతో గ్రామానికి ప్రత్యేక అధికారిగా నియమితులైన నదీం గ్రామానికి సరిగ్గా రావడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. 48 రోజులలో ప్రత్యేక అధికారి గ్రామానికి రెండు సార్లు మాత్రమే వచ్చారని, సమస్యలు ఎలా పరిష్కారం అవుతాయని ప్రశ్నించారు. ఇక ఉపాధి హామీపనులు చేయిస్తున్న సిబ్బంది పని తీరుపై కూడ గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం కార్యదర్శి ప్రదీప్ మాట్లాడుతూ.. గ్రామంలో మురికి కాలువల నీరు రహదారిపై ప్రవహిం చడకుండ చూడటంతో పాటు, గ్రామంలో నీటి ఎద్దడి తలెత్తకుండా ట్యాంకర్ ద్వారా నీరు సరఫరా చేస్తామని తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

బాన్స్‌వాడ, మార్చి 21: బాన్స్‌వాడ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట బస్సు ఢీకొని గురువారం వ్యక్తి ఢీకొని మృతి చెందిన సంఘటన ఒకటి చోటు చేసుకుంది. వివరాలు ఇలా... నిజామాబాద్ నుండి ఎల్లారెడ్డికి వెల్తున్ననిజామాబాద్ 2 డిపోకి చె ందిన ఆర్టిసి బస్సు గాందారి మండలం గండివేట్ తాండకు రమావత్ చందర్ (55) వారంత పు సంతకు వెల్తున్న క్రమంలో బస్సు ఢీకొట్టగా అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఎడపల్లిలో బైకు చోరీ

ఎడపల్లి, మార్చి 21: ఎడపల్లి మండల కేం ద్రంలోని నయాబాదీలో షేక్ ఇలియాస్ ఇంటి ముందు నిలిపిన ద్విచక్ర వాహనం బుధవారం రాత్రి చోరీకి గురయింది. బాధితుడు షేక్ ఇలియాస్ తెలిపిన వివరాల ప్రకారం ఏపి 25 ఎం 1643 నంబరు గల హీరో హోండా ద్విచక్ర వాహనాన్ని రోజులాగే తన ఇంటి గేటు ముందు పార్కింగ్ చేసి పడుకున్నాని, గురువారం ఉదయం లేచి చూసే సరికి తన బైకు ఇంటిముందు లేకపోవడంతో తన ఇంటికి అమర్చిన సీసీ టీవి పుటేజీని పరిశీలించగా ముసుగు వేసుకున్న వ్యక్తి తన బైకును తీసుకెళ్లిన దృశ్యాలు కనబడడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.

దొంగతనం కేసులో ఇద్దరికి మూడేళ్ల జైలు శిక్ష

బాన్స్‌వాడ, మార్చి 21: బాన్స్‌వాడ నియోజక వర్గంలోని బీర్కూర్ మండలం తిమ్మాపూర్ టిటిడి ఆలయంలో దొంగతనానికి పాల్పడిన ఇద్దరు వ్యక్తులకు 3సంవత్సరాల జైలు శిక్షతోపాటు ఒక్కొక్కరికి రూ.100 జరిమానా విధించినట్లు బాన్స్‌వాడ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ భార్గవి తీర్పు వెల్లడించారు. గత రెండు సంవత్సరాల క్రితం టిటిడి ఆలయంలో బీర్కూర్ గ్రామానికి చెందిన గైని కిరణ్, గుంజ గంగాధర్‌లు కలిసి టీటీడీలో చోరీకి పాల్పడిన కేసులో ఐపీసీ సెక్షన్ 457 మరియు 380 ప్రకారం ఒక్కొక్కరికి 3 సంవత్సరాల జైలు శిక్షతో పాటు, 100 రూపాయల జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌వీరయ్య, బీర్కూర్ ఎస్ఐ రాజశేఖర్, కోర్టు కానిస్టేబులు సాయిబాబలు ఉన్నారు.



పోచారం చెక్‌పోస్టు వద్ద నగదును స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

పోలీసుల తనిఖీల్లో 3.4లక్షల నగదు పట్టివేత

నాగిరెడ్డిపేట / భిక్కనూరు, మార్చి21: జిల్లాలోని వేర్వేరు రెండుచోట్ల రూ. 3,45,100లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నాగిరెడ్డిపేట మండలంలోని పోచారం చెక్‌పోస్టు వద్ద ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో గురువారం వాహనాలను తనిఖీ చేపట్టగా రెండు వాహనాల నుంచి రూ.2,50,100లను పట్టుకున్నట్లు ఎస్సై రాజు తెలిపారు. కౌడిపల్లి మండలం బొగ్గుగూడకు చెందిన కుమార్ కారులో మెదక్ వైపు వెళ్తుండగా వాహనాన్ని తనిఖీ చేయగా అతని వద్ద నుంచి రూ.2లక్షలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. అలాగే మర్దన్న పేట మండలంలోని బొగ్గులగూడెంకు చెందిన ఎం.డి.షాన్ వాహనం నుంచి రూ.50,100 స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. పార్లమెంట్ ఎన్నికలలో భాగంగా పోచారం చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీలను పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు ఎస్సై తెలిపారు. తనిఖీల్లో ఏఎస్సై ఉమేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. అలాగే భిక్కనూరు టోల్‌గేట్ వద్ద 44వ జాతీయరహదారిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద పోలీసులు తనిఖీ చేపట్టారు. మెదక్ జిల్లా కేంద్రానికి చెందిన ఈగ వెంకట్‌రెడ్డి తన వాహనంలో ఎలాంటి ఆధారాలు లేకుండా వెంట తీసుకెళ్తున్న రూ.95వేలను పోలీసులు స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు ఎస్సై సాయికుమార్ వెల్లడించారు. భిక్కనూరు టోల్‌గేట్ సమీపంలో ఏర్పాటు చేసి చెక్‌పోస్టు వద్ద మూడురోజుల్లో రూ.13,23,000లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో రూ.50వేల కంటే ఎక్కువగా నగదును ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకెళ్లొద్దని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మందాపూర్‌లో ఎడ్లబండ్ల ప్రదర్శన

బీబీపేట, మార్చి 21: బీబీపేట మండలంలోని మందాపూర్ గ్రామంలో వనదుర్గ పెద్దమ్మతల్లి 5వ వార్షికోత్సవంలో భాగంగా గురువారం ఎడ్లబండ్ల ప్రదర్శనను, తిరుగుబోనాల కార్యక్రమం నిర్వహించినట్లు ముదిరాజ్ సంఘసభ్యులు తెలిపారు. ఐదేళ్లకు ఒకసారి నిర్వహించే ఈ పండుగలో సంప్రదాయాన్ని మరవకుండా బోనాలు, బండ్ల ప్రదర్శన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘసభ్యులుఅధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గ్రంథాలయానికి స్టడీ ప్యాడ్‌ల అందజేత

బిచ్కుంద, మార్చి 21:మండల కేంద్రంలోని గ్రంథాలయానికి భూమి ఫౌండేషన్ లైన్స్‌క్లబ్ వారి ఆధ్వర్యంలో స్టడి ప్యాడ్లను వితరణ చేశారు. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని పెరుగుతున్న ఎండల దృశ్య అందరూ జాగ్రత్తగా ఉండాలనిభూమి ఫౌండేషన్ చలివేంద్రాలు ఏర్పాటుచేయనున్నట్లు ప్రజల దాహార్తి తీర్చేందుకు అందరూ నడుం బిగించాలన్నారు.ఈ కార్య క్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు హుండే బస్వరాజ్, సభ్యులు శివ, నాగేశ్వర్‌రావు, నర్సయ్య, ఓంప్రకాష్ పాల్గొన్నారు.

బస్వాపూర్‌లో కొనసాగుతున్న పెద్దమ్మ జాతర



బస్వాపూర్‌లో గంగబోనం తీస్తున్న గ్రామస్థులు

భిక్కనూరు, మార్చి21: భిక్కనూరు మండలంలోని బస్వాపూర్ గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ పెద్దమ్మ జాతర (ఆలయ వార్షికోత్సవం) కొనసాగుతుంది. జాతరలో బాగంగా గురువారం అమ్మవారిక ఇప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం డప్పుచప్పుళ్ల నడుమ గంగబోనం ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు మహిళలు గంగబోనంకు హరతులిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం గ్రామదేవతలకు బోనాల ఊరేగింపు కార్యక్రమాన్ని డప్పుచప్పుళ్ల, పోతరాజుల విన్యాసాల నడుమ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మదిరాజ్ సంఘం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రతీ కొనుగోలుపై రైతులకు బిల్లు ఇవ్వాలి

రామారెడి, మార్చి21: రైతులకు అమ్మిన మందులకు సంబంధించిన బిల్లును తప్పనిసరిగా ఇవ్వాలని జిల్లా వ్యవసాయాధికారిణి భాగ్యలక్ష్మీ ఫర్టిలైజర్ల దుకాణాల యజమానులను ఆదేశించారు. గురువారం మండల కేంద్రంతోపాటు రెడ్డిపేట, ఉప్పల్‌వాయి తదితర గ్రామాల్లో ఫర్టిలైజర్ల షాపులను ఆకస్మీకంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు ఫర్టిలైజర్ల షాపుల లో పలు సలహాలు, సూచనలు, పద్ధతులను వివరించారు.



ఫర్టిలైజర్‌ల దుకాణాలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారిణి



నిజాంసాగర్ బస్టాండ్ ఇదే..



అధ్వానంగా మారిన మరుగుదొడ్లు

బస్టాండ్‌లో మౌలిక వసతులు కరువు!

- శంకుస్థాపనలకే పరిమితం మరుగుదొడ్ల నిర్మాణ పనులు
- బస్టాండ్‌లో తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

నిజాంసాగర్, మార్చి21: నిజాంసాగర్ మండల కేంద్రంలోని బస్టాండ్‌లో మౌలిక వసతులు కరువయ్యాయి. బస్టాండ్ శిథిలావస్థకు చేరడంతో ఆర్టీసీ అధికారులు బస్టాండ్‌లో మరమ్మతులు చేపట్టి కలరింగ్ పనులు మరిచారు. 1989లో రూ.18లక్షలతో గ్రామీణ క్రాంతి పథకం కింద బస్టాండ్ నిర్మాణం చేపట్టారు. మొదట్లో ప్రయాణీకులకు అన్ని మౌలిక సదుపాయాలుండేవి. కాలక్రమేణా ఆర్టీసీ, పాలకుల యంత్రాంగం నిర్లక్ష్య వైఖరితో బస్టాండ్ వసతులు కరువయ్యాయి. బస్టాండ్‌లో ప్రయాణీకుల కోసం కనీసం తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు, కూర్చునేందుకు బెంచీలు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల జుక్కల్ ఎమ్మెల్యే ఎన్ఆర్ ఈజీఎస్ పథకం కింద మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టేందుకు శంకుస్థాపన చేశారు. కానీ ఇప్పటివరకు పనులు ప్రారంభం కాలేదు. గతంలో నిర్మించిన మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరాయి. బస్టాండ్‌కు వచ్చే మహిళా ప్రయాణికులకు కనీసం వసతులు లేకపోవడంతో అనేక అవస్థలు పడుతున్నారు. పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బస్టాండ్‌లో మౌలిక సదుపాయాలతో పాటు బస్టాండ్‌కు మరమ్మతు పనులు చేపట్టాలని కోరుతున్నారు.

అక్కాపూర్‌లో ఉచిత వైద్యశిబిరం

మాచారెడ్డి, మార్చి 21: మండలంలోని అక్కాపూర్ గ్రామంలో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో కంటి పరీక్షలు, గుండెకు సంబంధించిన పరీక్షలు, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. సుమారు వృద్ధులు, వికలాంగులు 300 మంది వరకు పాల్గొన్నారు. రోగులకు అవసరమైన మందులను అందించి తీసుకోవాల్సిన ఆహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ రాజన్న, డైరెక్టర్‌లు బుచ్చిరెడ్డి, మండల రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ నవీన్‌రెడ్డి, సతీష్, బట్టలత, రమేష్, మాజీ సర్పంచ్ మమతా బాబు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనులు సక్రమంగా నిర్వహించాలి



పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

రామారెడ్డి, మార్చి 21: ఉపాధి హామీ పనులను సక్రమంగా చేపట్టాలని రైతులకు ఇన్‌చార్జి ఎంపీడీవో సవిత తెలిపారు. మండలంలోని ఇసన్నపల్లి గ్రామ ఏరియాలో గురువారం పనులను పరిశీలించారు. ఉపాధి పనుల్లో ఎలాంటి అక్రమాలు లేకుండా సమయపాలన పాటించి లబ్ధిపొందాలని కూలీలకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఏపీఓ ధర్మారెడ్డి, పంచాయతీ కార్యదర్శి నాయక్, ఫీల్డ్ అసిస్టెంట్ భూమయ్య పాల్గొన్నారు.

కుక్కల దాడిలో జింక మృతి



కుక్కల దాడిలో మృతిచెందిన జింక

సదాశివనగర్, మార్చి 21: మండలంలోని అమర్లబండలో కుక్కల దాడిలో జింక మృతిచెందినట్లు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ పద్మ తెలిపారు. అమర్లబండ శివారు ప్రాంతంలో మేత కోసం వచ్చిన జింకను కుక్కలు వెంటపడడంతో గ్రామంలోకి వచ్చిందని, ఎటు పారిపోవడానికి వీలులేకపోవడం గ్రామంలో ఉన్న కుక్కలు కూడా తోడు కావడంతో జింకపై దాడిచేసినట్లు తెలిపారు. ఆడజింకకు సుమారు రెండేళ్ల వయస్సు ఉంటుందని తెలిపారు. పంచనామానిర్వహించి జింక మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నామని ఆమె తెలిపారు. అటవీజంతువుల సంరక్షణ కోసం ప్రభుత్వాలు గొప్పలు చెప్పడమే కాని అటవీప్రాంతాలలో నీరు ఏర్పాటు చేయకపోవడం తగిన వసతులు కల్పించకపోవడంతోనే బహిరంగ ప్రదేశాలకు మేత కోసం నీటికోసం వచ్చి మృత్యువాత పడుతున్నట్లు గ్రామస్థులు తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులు

రాజంపేట, మార్చి 21: మండలంలోని బీఆర్ఎస్, బీజేపీ నాయకులు గురువారం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ, జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి సురేష్‌షెట్కార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు జిల్లా అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని బీఆర్ఎస్, బీజేపీ నాయకులు పార్టీలో చేరుతున్నట్లు వారు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు యాదవరెడ్డి, యూత్ అధ్యక్షుడు కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు



జుక్కల్ ఎమ్మెల్యేకు గొర్రె పిల్లను బహూకరిస్తున్న గొల్ల కురుమలు

పెద్దకొడప్‌గల్, మార్చి 21: తెలంగాణ ప్రభుత్వం మొదటి విడత కింద మంజూరు ఇచ్చే ఇందిరమ్మ ఇళ్లను పార్టీలకు అతీతంగా అర్హులకు ఇవ్వనున్నట్లు జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్ రావ్ స్పష్టం చేశారు. గురువారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపుకార్యాలయంలో ప్రగతి పనులు, నియోజక వర్గ సమస్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తోట మాట్లాడుతూ.. మొదట విడత వచ్చే ఇళ్లను ముందుగా ఇండ్లు లేని నిరుపేదవారికి ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇందుకోసం గ్రామాలలో ఉండే కాంగ్రెస్ కార్యకర్తలు అర్హులను గుర్తించాలని సూచించారు. మొదటి విడతలో ఇళ్లు రానివారు ఆందోళన చెందనవసరం లేదని సూచించారు. విడతల వారీగా వచ్చిన ఇండ్లను అర్హులను ఇస్తామని తెలిపారు. ఇక గతంలో జుక్కల్ ఎమ్మెల్యేగా ఉన్న షిండే జుక్కల్‌కు రావాల్సిన ఇండ్లను పోచారం బాన్స్‌వాడకు తరలిస్తుంటుంటే ఏం చేశారని ప్రశ్నించారు. షిండే నిర్లక్ష్యంతోనే జుక్కల్‌కు ఇండ్లురాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేగాకుండ జుక్కల్ నియోజక వర్గంలో 184 గ్రామాలు ఉంటే 167 గ్రామాలకు తాగడానికి నీరు కల్పించలేని దుస్థితి చేశాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక ఎంపీ బీబీ పాటిల్ రెండు పర్యాయాలు జహీరాబాద్ ఎంపీగా పనిచేసి నియోజక వర్గానికి ఏంచేశారని ప్రశ్నించారు. బీబీ పాటిల్ బీఆర్ఎస్ పార్టీలో ఉంటే తాను ఓడిపోతానని తెలుసుకుని బీజేపీలో చేరాడని పేర్కొన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన మూడు నెలల్లోనే నియోజక వర్గంలో సీసీ రహదారులు, డ్రైనేజీలు, అంగన్‌వాడీ భవనాలు, తాగునీటి కొరత తీర్చేందుకు బోర్లు, పాఠశాల భవనాలు ఇలా ఎన్నో అభివృద్ధి పనులు చేస్తున్నానని తెలిపారు. దీంతో పాటుగానే కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలలో భాగంగా ఇచ్చిన వాటిలో 5 పథకాలు జుక్కల్‌లో విజయవంతంగా పనిచేస్తున్నాయని తెలిపారు. అందుకే జుక్కల్ నియోజక వర్గ ప్రజలు ఆలోచించి రానున్న ఎంపీ ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓటు వేసి సురేష్ షెట్కార్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని సూచించారు. అంతకు ముందు జుక్కల్, బిచ్కుంద, మద్నూర్, డోంగ్లీ మండలాలలోని వివిధ గ్రామాలకు చెందిన గొల్లకురుమలు ఎమ్మెల్యే తోట సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా గొల్లకురుమలు తోటకు గొర్రె పిల్లను బహూకరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అస్పత్‌వార్ వినోద్, రమేష్ దేశాయి, సాయిలు, విఠల్ గురూజీ, లక్ష్మణ్‌పటేల్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మ ఆలయానికి మైక్ సెట్ అందజేత



ఆలయానికి మైక్‌సెట్ అందజేస్తున్న మద్ది నాగరాజు దంపతులు

భిక్కనూరు, మార్చి 21: మండలంలోని బస్వాపూర్ పెద్దమ్మ ఆలయానికి గ్రామానికి చెందిన మద్ది నాగరాజు దంపతులు గురువారం మైక్ సెట్‌ను వితరణ చేశారు. ఈ సందర్భంగా దాత నాగరాజు మాట్లాడుతూ తన తండ్రి బాలరాజు జ్ఞాపకార్థం రూ.16వేల విలువ కలిగిన మైక్‌సెట్‌ను అందజేయడం జరిగిందని, మున్ముందు ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తానని తెలిపారు. అనంతరం ముదిరాజ్ సంఘం సభ్యులు మాట్లాడుతూ నాగరాజుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి చిన్నమల్లారెడ్డి మాజీ సర్పంచ్



గట్టుగోని రామాగౌడ్‌కు పార్టీ కండువా కప్పుతున్న షబ్బీర్ అలీ

కామారెడ్డి టౌన్, మార్చి 21: కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ గట్టుగోని రామాగౌడ్‌తో పాటు ఆయన అనుచరులు 150 మంది కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ ఆయనకు కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, లీగల్‌సెల్ చైర్మన్ దేవరాజుగౌడ్, రాజాగౌడ్, ఆనంద్‌రావు, శ్రీనివాస్, రాజు, పాజిల్ తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

కామారెడ్డి టౌన్, మార్చి 21: పట్టణంలోని కటిక గల్లిలో నివాసముండే అంకరాజు నవీన అనే యువతి కనిపించకుండా పోయినట్లు సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. నవీనకు వివాహం జరగగా భర్తతో విభేదాల కారణంగా తల్లివద్దనే ఉంటుంది. బుధవారం తల్లిశోభకు నవీనకు మధ్య గొడవ జరుగగా ఇంట్లోంచి ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయింది. దీంతో కుటుంబీకులు చుట్టుపక్కల వెతికినా ఎలాంటి ఆచూకీ లభించ లేదు. దీంతో ఆమె తల్లి శోభ పోలీసుస్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

నేడు రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

దోమకొండ, మార్చి 21: మండలంలోని గొట్టిముక్కుల గ్రామంలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సంచార ఆరోగ్య శిబిరం నిర్వహిస్తున్నట్లు రెడ్ క్రాస్ సొసైటీ మండలాధ్యక్షుడు బుర్రి రవి కుమార్ గురువారం తెలిపారు. 60 సంవత్సరాల పైన వృద్ధులు, వికలాంగులకు ప్రత్యేకంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

ఐటీ హబ్‌ను సందర్శించిన అర్బన్ ఎమ్మెల్యే



ఐటీ హబ్ సిబ్బందితో మాట్లాడుతున్న నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే

పెద్దబజార్, మార్చి 21: నగరంలోని బైపాస్‌లో గత ఎనిమిది నెలల క్రితం ప్రారంభించిన ఐటీహబ్‌ను మొదటిసారిగా అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం మాజీ ఐటీ మంత్రి కేటీఆర్ ప్రారంభించిన నిజామాబాద్ ఐటీ హబ్ కోట్ల రూపాయల ప్రజాధనంతో నిర్మించి ఇక్కడ ఉన్న నిరుద్యోగులకు ఉపాధి కల్పించే లక్ష్యంతో నిర్మించిన గత పాలకులు దృష్టి పెట్టకపోవడంతో కంపెనీలను తీసుకురాకపోవడంతో విఫలమైందన్నారు. 671 సిట్టింగ్ కెపాసిటీ ఉన్న ఐటీహబ్‌లో 313 మంది మాత్రమే పూర్తయ్యారని అన్నారు. ఇంకా 368 ఖాళీలు ఉన్నాయని అన్నారు. రాబోయే రోజుల్లో తప్పకుండా ఐటీహబ్‌పైన ప్రత్యేక దృష్టి పెట్టిటాప్ కంపెనీలతో మాట్లాడి మన జిల్లా ఐటీహబ్‌కు తీసుకొచ్చే విధంగా కృషి చేస్తానన్నారు. ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ఐటీహబ్ అభివృద్ధికి ఇక్కడున్న నిరుద్యోగులకు ఉపాధికల్పించే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. డిగ్రీ, బీటెక్ చదువుతున్న, పూర్తి చేసిన నిరుద్యోగులు టాస్క్ ద్వారా ఐటీ, నాన్ ఐటీ రంగాల్లో స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ తీసుకొని ఉపాధి అవకాశాలు పొందవచ్చని ఈ అవకాశాన్ని అంద రూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పంచరెడ్డి ప్రవళిక, సుమిత్ర కిశోర్, ఆకుల శ్రీనివాస్ హేమలత,విజయ్, బీజేపీ నాయకులు బం టురాము, రోషన్ లాల్‌బోరా, పంచరెడ్డి శ్రీధర్, ప్రభాకర్, రాజేందర్ పాల్గొన్నారు.

నిఫ్ట్ 2024 ఎంట్రన్స్ ఫలితాల్లో విజయం

ఎల్లారెడ్డి, మార్చి 21: పట్టణానికి చెందిన ముత్యాల రామేశ్వర్‌రావు, లక్ష్మీ దంపతుల కూతురు ముత్యాల వైష్ణవి (ఎన్ఐఎఫ్‌టీ) నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ గత నెల ఫిబ్రవరి 5న దేశ వ్యాప్తంగా నిర్వహించిన ప్రవేశ పరీక్షలో 58 వేల మంది విద్యార్థులు పోటీ పడగా 4710 సీట్లకు గాను అర్హత సాధించినట్లు వైష్ణవి తండ్రి రామేశ్వర్‌రావు తెలిపారు. 8వ తరగతి నుంచి ఫ్యాషన్ టెక్నాలజీపై ఉన్న మక్కువతో నేను కష్టపడి చదివి దీనిలో అర్హత సాధించినట్లు వైష్ణవి తెలిపారు. ఈ కోర్సులో ఎక్కువగా నార్త్ సైడ్ వాళ్లే ఎక్కువగా ఉంటారని, మన తెలంగాణ నుంచి అంతగా ఈ కోర్సు పట్ల శ్రద్ధ చూపారని అందుకే నేను ఈ కోర్సుపై శ్రద్ధ చూపానని ఆమె తెలిపారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

పెద్ద కొడప్‌గల్, మార్చి 21: మండలంలోని పోలింగ్ కేంద్రాలను గురువారం ఇన్‌చార్జి ఎంపీడీవో సూర్యకాంత్ పరిశీలించారు. ఈ సందర్భంగా సూర్యకాంత్ మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతులు ఎలా ఉన్నాయనే అంశంపై పోలింగ్ కేంద్రాలు సందర్శిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చెక్కు అందజేత

పెద్ద కొడప్‌గల్, మార్చి 21: పెద్దకొడప్‌గల్ సహకార సంఘం ఆధ్వర్యంలో గురువారం బాధిత కుటుంబానికి లక్ష రూపాయల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ.. తమ సంఘంలో గడ్డం బల్‌రాం సభ్యుడు కాగా, సెప్టెంబర్‌లో బల్‌రాం రోడ్డు ప్రమాదంలో మరణించారని తెలిపారు. జనతా పర్సనల్ బీమా ద్వారా లక్ష రూపాయల చెక్కును అందజేశామన్నారు. కార్యక్రమంలో సీఈవో సందీప్ తదితరులు పాల్గొన్నారు.

అడవులే మనకు రక్షణ.. అడవులే మనకు సంపద

రామారెడ్డి, మార్చి21: అడువులే మన రక్షణ.. అడవులే మనకు సంపద అని రామారెడ్డి ఫారెస్ట్ సెక్షన్ అధికారి శంకర్ తెలిపారు. ప్రపంచ అటవీ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాలలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ప్రతీఒక్కరు తమ వంతుగా చెట్లను నాటడం ఎంచుకోవాలని తెలిపారు. ప్రాణ వాయువు ఇచ్చి మనఊపిరి నిలిపే అడవులకు మనమిచ్చే బహుమతి వాటిని కాపాడుకోవడమే అని అన్నారు. కార్యక్రమంలో అధికారులు జయశ్రీ, శ్రీధర్ కుమార్, సుదీర్, రామనీలా, శంకర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న అటవీశాఖ అధికారులు

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

ప్రియా 35 - ఓం భీం బుష్
దర్శన్ - రజాకర్
శాంతి - ప్రేమలు
ప్రియా 70 - భీమా

బాన్సువాడ

వెంకటేశ్వర - రజాకర్
మహేశ్వరి - ఓం భీం బుష్

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	120	200	220
వెన్‌కాబ్(కిలో)	:	120	210	230

